క్లుప్తంగా

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాల ఎదురుగా ఉన్న శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాసవీ క్లబ్ రాజంపేట శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో తిరుపతి అరవింద్ ఐకేర్ హాస్పిటల్ వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. కంటి పొర, కంటి శుక్ల సమస్యలు ఉన్న వారిని తిరుపతికి తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు వారు తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు, ఫోన్ నెంబర్‌ను తమ వెంట తీసుకురావాలని తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని అదే రోజు తిరుపతికి ప్రత్యేక వాహనాల్లో తీసుకెళతామని, అందువల్ల కంటిచూపు సమస్య ఎక్కువగా ఉన్న వారు రెండు రోజులకు సరిపడా దుస్తులను తెచ్చుకోవాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

తూకాలు సరిచూసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె : రేషన్ షాపు డీలర్లు నిత్యావసర సరుకుల గోదాం నుంచి తీసుకెళ్లేటప్పుడు ప్రతి వస్తువు తూకాలు వేసుకొని తీసుకెళ్లాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీలర్లు, ఎండీయూలకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి వస్తువు తూకాలు వేసుకొని ఎండీయూ వాహనం ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్ద పంపిణీ చేయాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రేషన్ షాప్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాగరాజు, జాకీర్, దేవప్రసాద్, రెడ్డయ్య, ఈశ్వరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాజంపేట విద్యార్థి


యశ్వంత్

రాజంపేట టౌన్ : జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు రాజంపేటలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న అబ్బిగారి యశ్వంత్ ఎంపికయ్యారు. ఈవిషయాన్ని శుక్రవారం ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ అమృత్‌రాజ్ జారియ ఇక్కడి విలేకరులకు తెలిపారు. కేంద్రీయ విద్యాలయం విభాగంలో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అండర్–17 52వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో యశ్వంత్ విశేష ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడని తెలిపారు. ప్రిన్సిపాల్ అమ్రుత్‌రాజ్, స్పోర్ట్స్ కోచ్ మహేష్‌బాబు యశ్వంత్‌కు ప్రశంసా పత్రాన్ని అందచేసి అభినందించారు.

వ్యవసాయ కిట్లు పంపిణీ


ఎస్సీ రైతులకు కిట్లను అందిస్తున్న అధికారి

రామాపురం : మండలంలోని ప్రకృతి వ్యవసాయం చేసే 15 మంది ఎస్సీ రైతులకు శుక్రవారం అన్నమయ్య జిల్లా స్పందన ఆఫీసులో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నల్లగుట్టపల్లె, చిట్లూరు, బండపల్లె రైతులకు రూ.10వేలు విలువ గల నవధాన్యం కిట్లు, పట్టలు, డ్రమ్ములు, పసుపు ప్లేట్స్, లింగాకర్షక బుట్టలు ఉన్న కిట్లను రైతులకు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారుల సమక్షంలో అందించినట్లు మండల ప్రకృతి వ్యవసాయ యాంకర్ నూరం వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే 20 మంది రైతులకు కందులు ఉచితంగా ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గం ఎన్నిక


హెచ్‌సీ శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె : పీఆర్‌టీయూ నూతన మండల కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో మండలశాఖ అధ్యక్షుడిగా హెచ్‌సీ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.రామ్మోహన్, గౌరవాధ్యక్షుడుగా బివి రమణ, మండల వర్కింగ్ ప్రెసిడెంటుగా వి.వెంకటరమణ, ఇతర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవలంపల్లి ప్రధానోపాధ్యాయులు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం సభ్యులతోపాటు ఎస్.చలపతి నాయుడు, ఎస్.ఆంజనేయులు, సి.హరినాథ రాజు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నివాళి

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కుర్నూతల గ్రామం కె.అగ్రహారానికి చెందిన దామ రామాంజనేయులు (49) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి స్థానిక ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో కలిసి రామాంజనేయులు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కస్తూరిరాజుగారిపల్లె గ్రామం చాగలగుట్టపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రవి(55) అనారోగ్యంతో మృతి చెందడంతో రవి మృతదేహానికి ఆయన నివాళి అర్పించారు. అనంతరం బెంగళూరులో జరిగిన ప్రమాదంలో గాయపడిన అభిషేక్‌రెడ్డిని పరామర్శించారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్

– గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు


చిట్వేలి: సంక్షేమ బావుటాను అందిస్తున్న దృశ్యం


రైల్వేకోడూరు: డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

చిట్వేలి : రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీ మేరకు సంక్షేమాన్ని కొనసాగిస్తున్న సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. నగిరిపాడు సచివాలయం పరిధిలోని వెంకట్రాజుపల్లి అరుంధతి వాడలో శుక్రవారం మధ్యాహ్నం మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి అందరినీ పలకరిస్తూ సంక్షేమ పథకాలను వివరిస్తూ వినతులు, సమస్యలను స్వీకరిస్తూ పరిష్కారానికి అధికారులకు నివేదిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎల్‌వీ మోహన్ రెడ్డి, మహేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపీపీ చంద్ర, లింగం లక్ష్మీకర్‌తోపాటు శివసాయి, స్థానిక నాయకులు శివారెడ్డి, వెంకటరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రాజేంద్రరెడ్డి, గంగాధర్, రమేష్ రెడ్డి, ఈశ్వరయ్య, నరసింహులు, ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రైల్వేకోడూరు : దేశానికి సంక్షేమాన్ని పరిచయం చేసింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డివారిపల్లె గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.33లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీలకు భూమి పూజ చేశారు. అలాగే రూ.40 లక్షలతో చేస్తున్న చెరువు కట్ట మరమ్మతులను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ మందల నాగేంద్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, తోట శివసాయి, సీహెచ్ రమేష్, పంచాయతీరాజ్ డీఈఈ బాలనరసింహులు, ఇరిగేషన్ డీఈ చెంగల్‌రాయుడు, శ్రీకారం శివయ్య, కొరముట్ల చంద్రశేఖర్, మస్తాన్, హరి, కాంట్రాక్టర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొరముట్లను కలిసిన నూతన ఆర్డీఓ రామక్రిష్ణారెడ్డి

రాజంపేట నూతన ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన రామక్రిష్ణారెడ్డి శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్లను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. మీ పరిధిలోని భూసమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులకు ఆర్డీఓకు కొరముట్ల ఆదేశించారు.

సమస్యలు పరిష్కరించండి

చిన్నమండెం : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీరాములునాయక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలన్నారు. సెంటర్ అద్దెలు, టీఏ బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేయాలని, సిలిండర్లు, గ్యాస్ స్టవ్‌లు ఇవ్వాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

న్యూట్రీషన్ ఫుడ్ పంపిణీ

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని కోనంపేట సీహెచ్‌సీ ఆసుపత్రిలో టీబీ రోగులకు శుక్రవారం పౌష్టిక ఆహారాన్ని అందజేసినట్లు వైద్యులు సిద్దయ్య తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లిలో ఉండే టీబీ రోగులకు దాతల సహకారంతో రోగులకు మంచి ఆహారం అందించాలనే ఉద్దేశంతో టీబీ యూనిట్ రోగులకు న్యూట్రీషన్ ఫుడ్ ఇచ్చామన్నారు. రోగులకు గత 5 నెలలుగా న్యూట్రీషన్ ఫుడ్ ఇస్తున్నామని, రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి దాతలు సహాయ సహకారాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


చిన్నమండెం: బాసికం తీసుకొస్తున్న భక్తులు


పెనగలూరు: కొలువుదీరిన బాదుల్లాస్వామి పీరు

పెనగలూరు : హిందూ, ముస్లింలు ఐక్యతగా మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనగలూరు, ఓబిలి, చక్రంపేట, నాయుడు వారిపల్లి, నల్లపరెడ్డిపల్లె, కొండూరు గ్రామాలలో వేడుకలను అత్యంత ఘనంగా జరిపారు. శనివారం తెల్లవారుజామున గుండం తొక్కే కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ గుండం కార్యక్రమానికి అత్యధికంగా హిందువులే కట్టెలు తోలి తమ మొక్కులు తీర్చుకుంటారు. శుక్రవారం రాత్రి అన్ని మతాల వారు పెద్ద సంఖ్యలో పీర్ల చావడి వద్ద చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం సాయంత్రం పీర్లను యేటికి పంపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మత సామరస్యాలకు అతీతం పీర్ల పండుగ

వీరబల్లె (రాయచోటిటౌన్) : పీర్ల పండుగ అంటేనే కుల, మతాలకతీతంగా నిలుస్తుందని వీరబల్లె ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి విజయ సాగర్ రెడ్డిలు అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని వీరబల్లె ఈడిగపల్లెలో నిర్వహించిన పీర్ల పండుగ వేడుకలలో భాగంగా పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులు

రాజంపేట రూరల్ : పీఎస్ఎల్‌వీ సీ56 రాకెట్ ప్రయోగాన్ని దగ్గర నుంచి చూసేందుకు రాజంపేట డీపో నుంచి శ్రీహరికోటకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అదే విధంగా ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి ప్రత్యేక బస్సులను నడపుతున్నట్లు తెలియజేశారు. ఈ సదావకాశాన్ని విద్యార్థులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225775, 7382868300, 7382868291, 7981738566 నెంబర్లను సంప్రదించాలన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన

పుల్లంపేట : వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఏటీఎంఏ) ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో చిరుధాన్యాలతోపాటు ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి కృష్ణచైతన్య రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భాస్కర్, ఏటీఎంఏ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు గుర్తింపు

– కలెక్టర్ చేతుల మీదుగా కుమ్మరి కార్పొరేషన్ జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులకు నియామకపత్రాల అందజేత


కలెక్టర్‌ను సత్కరిస్తున్న కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం

రాయచోటి : దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మండేపూడి పురుషోత్తం అన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ గిరీషా పీఎస్‌ను కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పురుషోత్తం మర్యాదపూర్వకంగా కలిసి కుమ్మరుల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ జిల్లా సంక్షేమ కమిటీ సభ్యుల నియామకపత్రాలను కలెక్టర్ చేతుల మీదుగా అందించామన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సందప్ప, ఈడీ బీసీ కార్పొరేషన్ సిబ్బంది, హెచ్‌డబ్ల్యూఓ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి, కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ జిల్లా సంక్షేమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలి


రోగులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయచోటి అర్బన్ : ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టిని సారించాలని ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డేవిడ్ సుకుమార్, వైద్యులు మహేశ్వరరాజు, రాజులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ హైపటైటిస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తమ ఆరోగ్య పరిరక్షణ అవసరమన్నారు. నిత్యం ఎక్కువగా నీటిని సేవించడం, సమయానికి భోజనం, వాకింగ్ తదితరాలతో బీపీ, షుగర్‌తోపాటు పలురకాల రోగాలను నియంత్రణలో ఉంచవచ్చునన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అధికారి ఎస్.అష్రఫ్‌అలీ, అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి షౌకత్‌అలీఖాన్‌తోపాటు ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులు, సిబ్బందిలు పాల్గొన్నారు.

సేవాభావాన్ని పెంపొందించాలి

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని పెంపొందించేందుకు కృషి సల్పాలని వైద్యులు డేవిడ్ సుకుమార్, మహేశ్వరరాజు, బండారు కిరణ్‌కుమార్‌లు తెలిపారు. వైఎస్ఆర్‌సీపీ నేత, మాజీ ఎంపీపీ జీఎండీ రఫీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబీకులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు, పండ్లతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. మనం సేవాసంస్థతో కలసి పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీఎండీ రఫీ కుటుంబీకులు ఇమ్రాన్, ఇర్షాద్‌తోపాటు పలువురు మాసాపేట యువకులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన చండీయాగం


చండీయాగంలో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు : మండలంలోని అనంతరాజుపేట పంచాయతీలోని వెంగమరాజుపోడు సమీపంలోని రామాలమ్మ క్షేత్రం వద్ద మూడురోజులపాటు నిర్వహించిన చండీయాగం శుక్రవారంతో ముగిసింది. చివరిరోజు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రుత్వికులు సప్తశతి పారాయణాలు, హోమగుండం వద్ద రుత్విక్కులు ప్రత్యేక హోమం చేశారు. అనంతరం పార్వతీపరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. నిర్మలమైన భక్తితో చేసే యాగానికి దేవతానుగ్రహం విశేషంగా ఉంటుందని వేదపండితులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు వెంకట్రామరాజు, ఆర్‌సీ సురేష్‌బాబు, కంపరాజు నాగేంద్రరాజు, ప్రజలు పాల్గొన్నారు.

డీఈఓపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

లక్కిరెడ్డిపల్లె : డీఈఓ రాఘవరెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులపై నిందలు వేయం సబబు కాదన్నారు. కడప జిల్లాలో విద్య అభివృద్ధికి కృషి చేస్తున్న ఉన్నతాధికారిపై ఎలాంటి ఆరోపణలు చేసిన విద్యార్థి లోకం సహించదన్నారు. అన్నమయ్య జిల్లా కెవిపల్లె, కస్తూర్బా స్కూల్‌కు చెందిన అనాథ దళిత విద్యార్థినిని దత్తత తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, అధికారులు గుర్తించాలన్నారు. కడప జిల్లాలో బడికి వెళ్లని కొందరు ఉపాధ్యాయులు, నిజాయతీ గల అధికారులు ఉంటే తమ ఆటలు సాగవని పదేపదే తప్పుడు ఆరోపణలు చేసి జిల్లా విద్యాశాఖకు చెడ్డపేరు తెస్తున్నారన్నారు. ఇది ఇలాగే కొనసాగితే అటు ఉపాధ్యాయ, విద్యార్థి లోకం, ప్రజలు రోడ్లపైకి చేరి నిరసనలు తెలిపే అవకాశం ఉందని, ఈ విషయాన్ని పైఅధికారులు గుర్తించాలన్నారు.

డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాటం

రాయచోటి : తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాడాలని విద్యుత్ శాఖ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. విద్యుత్ యాజమాన్యం సమస్యలను పరిష్కరించాలంటూ ఏపీ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు చిత్తూరు మార్గంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు రెండో రోజు నిరసన చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి విద్యుత్ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ సంస్థల యాజమాన్యాలు, రాష్ట్ర ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శిలు వెంటనే పరిష్కరించాలన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ప్రతిరోజు నిరసన ప్రదర్శనలు ఉంటాయన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి విద్యుత్ కార్మికుడు ఈ నిరసనలో పాల్గొని విజయవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

రాజంపేటలో..

రాజంపేట రూరల్ : ఈపీఎఫ్ టు జీపీఎఫ్‌ను వెంటనే అమలు చేయాలని విద్యుత్ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేసారు. స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం వద్ద శుక్రవారం భోజన విరామ సమయంలో విద్యుత్ జేఏసీ ఆధ్వర్యంలో రెండవ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీని అమలు, కాంట్రాక్ట్ కార్మికులు గ్రేటు జేఎల్‌ఎంల రెగ్యులర్ చేయాలని కోరారు. నిరసనలో జేఏసీ చైర్మన్ కె.వాసుదేవరాజు, జనరల్ సెక్రటరీ ఎం.సురేంద్రనాథ్, కన్వీనర్ కె.రామిరెడ్డి, డివిజనల్ డిప్లమా అసోసియేషన్ పి.కుమార్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

చిట్వేలి : పాత చిట్వేలిలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయానికి స్థానికుడు గూడురు సుబ్బరాజు కుటుంబ సభ్యులు రూ. 4 లక్షలు శుక్రవారం విరాళం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల విరాళాలతో కల్యాణ మండపం, వసతి గృహాలు నిర్మిస్తున్నారు. ఇందుకోసం సుబ్బరాజు దంపతులు, వారి కుమారుడు దినేష్ వర్మ దంపతులు రూ. 4 లక్షలను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల విశ్వనాథం, గూడూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతును ఉపసంహరించుకోవాలి

రాజంపేట రూరల్ : పుంగనూరు నియోజకవర్గానికి చెందిన బోడే రామచంద్రయాదవ్ నూతనంగా పార్టీ ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణకు ఇస్తానన్న మద్దతును ఉపసంహరించుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ్ తెలియజేశారు. మండల పరిధిలోని కే బోయినపల్లిలో సంజీవ్ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చిన జాతీయ, ప్రాంతీయ పార్టీలు ప్రజలలో ఏ విధంగా ఆదరణ కోల్పోయాయో గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. అవగాహన లేకుండా మాట్లాడితే పార్టీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు


మంచి నీటిని అందిస్తున్న ఎన్ఆర్ఐ కేకేరెడ్డి

రాజంపేట రూరల్ : పుట్టిన గ్రామంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం నా అదృష్టంగా భావిస్తున్నట్లు పెద్దకారంపల్లి వాస్తవ్యుడు కృష్ణకుమార్ రెడ్డి (ఎన్ఆర్ఐ కేకే రెడ్డి) తెలియజేశారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లి పంచాయతీలోని అవసానపల్లి దళితవాడలో నూతనంగా తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డితో కలిసి కేకేరెడ్డి ప్రారంభించారు. ఎంపీటీసీ ఎ.వరదరాజు, నిర్వాహకులు మన్నూరు రామలక్షుమమ్మ, మన్నూరు సుబ్బారెడ్డి, సుభోద్‌రెడ్డి, శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డి.భాస్కర్‌రాజు, సుబ్బరాయుడు, డాక్టర్ హెచ్‌వీ రాజు, ప్రజలు పాల్గొన్నారు.

ఐటీ నిపుణులకు స్పాన్సర్‌షిప్

అమెరికాకు వెళ్లాలనుకునే ఐటీ రంగ నిపుణులకు మన్నూరు రామలక్ష్మమ్మ నారాయణరెడ్డి ఫౌండేషన్ ద్వారా స్పాన్సర్‌షిప్ ఇవ్వనున్నట్లు మన్నూరు కేకే రెడ్డి తెలియజేశారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లెలో ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తమ తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా నిర్వహించే ఈ స్పాన్సర్‌షిప్‌లో మండల పరిధిలోని వారికి 2024 వీసా కోటాకు సంబంధించి స్పాన్సర్ చేయనున్నట్లు పేర్కొన్నారు. సమాచారం కోసం జనార్దనరెడ్డి(9652789456), అశోక్ రెడ్డి(8886003534)లను ఫోన్‌లో సంప్రదించాలన్నారు.

బాలికల హాస్టల్ ఆకస్మిక తనిఖీ


ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

నందలూరు(రాజంపేట) : మండలం కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే బాలిక హాస్టల్‌ను శుక్రవారం ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు హాస్టల్‌లోని బియ్యాన్ని, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పర్యవేక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ హాస్టల్‌కు సరఫరా అయిన వంట సామగ్రి, ఆహార ధాన్యాలు, నిత్యావసర సరుకులలో ఎటువంటి నాణ్యత లోపం లేదని అంతా సజావుగా ఉందని ఫుడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో తేట తెల్లమైందని ఆయన తెలిపారు.

హమ్మయ్యా.. సమస్య పరిష్కరించారు

ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న సమస్యకు పరిష్కారం లభించింది. నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని ప్రధాన రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రజలకు, అంగన్‌వాడీ పాఠశాల విద్యార్థులకు సమస్యగా మారాయి. ఈ విషయాన్ని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు సమస్యను వివరించారు. అధికారులు కాంట్రాక్టర్ ద్వారా అందనంత ఎత్తులో దిమ్మె కట్టి కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పైన ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం ఎంపీపీ, సర్పంచ్‌లు ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంత వాసులు విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె : విద్యుత్ ప్రమాదంలో 60 శాతం కాలిన శరీరంతో తిరుపతిలో చికిత్స పొందుతున్న విష్ణువర్దన్ రెడ్డికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. రూ. 1.5లక్షలు విలువైన చెక్కును శుక్రవారం ముక్కా సాయివిశాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధితుడి తండ్రి శ్రీనివాసుల రెడ్డికి అందజేశారు. ఆర్థిక సహాయం అందించినందుకు బాధితుడి తండ్రి శ్రీనివాసులు రెడ్డి ముక్కా రూపానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముక్కా సాయివికాష్ రెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్ పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


క్షేత్రస్థాయిలో రైతులకు సలహాలిస్తున్న శాస్త్రవేత్తలు

సిద్దవటం : మండలంలోని టక్కోలి, డేగనవాండ్లపల్లె గ్రామాల్లోని వేరుశనగ, మామిడి తోటలను శుక్రవారం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త ఎస్. రాజ్యలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.మానస పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి తోటల్లో మొక్కల ఎదుగుదల సరిగా లేనట్లు గుర్తించారు. భూమిలో అధిక క్షారత్వం వల్ల ఇలా జరగవచ్చునన్నారు. కావున భూసార పరీక్షలు విధిగా చేసుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగా సరైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, సూక్ష్మ పోషక మిశ్రమాల పిచికారీ వంటి చర్యలు మొక్కల ఎదుగుదలకు తోడ్పడతాయన్నారు. మామిడిలో మిడ్జ్ ఈగ నియంత్రణకు డైమిథోయేట్ 2 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి చొప్పున పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో అక్కడక్కడ ఇనుప ధాతు లోపం ఉన్నట్లు గుర్తించారు. దీని నివారణకు ఎకరాకు 1 కిలో అన్నబేధి, 200 గ్రాముల నిమ్మ ఉప్పును 200 లీటర్ల నీటితో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, వి.ఏ.ఏ రైతులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని రీసోర్స్ పర్సన్, ప్రొఫెసర్ జి.జనార్దన్‌రాజు అన్నారు. శుక్రవారం సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ‘వ్యక్తిత్వ వికాసం– కెరీర్’ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి తమ జీవిత గమ్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. గమ్యాన్ని చేరడానికి అంకితభావం, కృషి, పట్టుదల, ధనాత్మక ఆలోచన, ఒత్తిడిని జయించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఉద్యోగాన్వేషణ లో కమ్యూనికేషన్స్ స్కిల్స్ ప్రాత కీలకమన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సాయి విద్యాసంస్థల ఏడీ సుధాకరరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

రాయచోటి అర్బన్ : ఏబీవీపీ పిలుపు మేరకు శుక్రవారం రాయచోటిలో చేపట్టిన జూనియర్ కళాశాలల బంద్ విజయవంతమైంది. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ జె.పి.నాగిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జూనియర్ కళాశాలతో పాటు అన్ని ప్రైవేటు జూనియర్ కళాశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో 4వేలకు పైగా ఖాళీగా ఉన్న అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్‌లను వెంటనే నియమించాలన్నారు. అలాగే విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు.

వాతావరణ కాలుష్యాన్ని నివారించాలి

సిద్దవటం: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని డిప్యూటీ రేంజర్ ఓబులేస్ అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సంఘం వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదేశాల మేరకు సిద్దవటం రేంజర్ కళావతి సూచనల మేరకు సిద్దవటంలోని శ్రీ భారతి హైస్కూల్ అవరణతోపాటు కపర్థీశ్వరస్వామి ఆలయం ఆవరణలోనూ మొక్కలు నాటించామన్నారు. సప్తగిరి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ఎఫ్‌బీఓలు, ఏబీఓలు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.